క్లుప్తంగా

ఘనంగా మహావీర్ జయంతి



మహావీర్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న జైనులు

ఆదోని అర్బన్: మహావీర్ జయంతిని మంగళవారం జైనులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు స్థానిక విక్టోరియాపేటలో వెలిసిన మహావీర్ చిత్రపటాన్ని రథంలో ఉంచి విక్టోరియాపేటలోని జైన్ మందిరం నుంచి పాత బస్టాండు, ఎంఎం రోడ్డు, షరాఫ్‌బజార్ జైన్ మందిరం వరకు ఊరేగింపు చేశారు. అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున జైనులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోట వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కోట భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని కోట నగర్‌లో వెలిసిన కోట భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి ఉత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులపాటు ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవిశెట్టి మంజునాథ్ ఆధ్వర్యంలో బుధవారం భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి వారికి కల్యాణం ఉంటుంది. గురువారం సాయంత్రం రథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం ఉంటుంది. మూడు రోజులపాటు భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలతో పాటు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పూలు, వెండి అలంకరణ, నైవేద్యంతో పాటు పూజలు జరుగుతాయి.

తాగునీటికి ఢోకా లేదు

- మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత



ఎస్ఎస్ ట్యాంకులో ఫిల్టర్ నీటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని టౌన్: స్థానిక మున్సిపాలిటీలో తాగునీటికి ఎలాంటి ఢోకా లేదని చైర్‌పర్సన్ బోయ శాంత తెలిపారు. మంగళవారం ఆమె వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, మహ్మద్‌స్వామి, రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ, రహిమాన్, చలపతి, సురేష్, లక్ష్మన్న, లలిత, మధుసూదన్‌శర్మ, మల్లి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ మదన్‌లతో కలిసి బసాపురం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంకులో వంద రోజులకు సరిపడే నీరు నిల్వ ఉందన్నారు. ఈనెల 10వ తేదీ వరకు తుంగభద్ర దిగువ కాలువలో నీటి సరఫరా ఉంటుందని, అంతలోగా మరో పది అడుగులు మేర ఎస్ఎస్ ట్యాంకులోకి రా వాటర్‌ను పంపింగ్ చేస్తామని చెప్పారు. పైపుల లీకేజీలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర వాటిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించి పరిష్కరించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జ్యోతిర్మయి విద్యాలయ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రఘురామయ్య చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆదోని అర్బన్: మండల పరిధిలోని నారాయణపురం ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమానికి ఎంఈఓ శివరాములు హాజరై బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరళమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లీలావతి, ఉపాధ్యాయులు జానకీ, సోమశేషాద్రిరెడ్డి, మాధవీలత, రేణుక, అనురాధ, భాగ్య, చంద్రకళ, దేవి, సరస్వతి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన యల్లమ్మ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే బంధువులు చూసి ఆమెను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కుటుంబ కలహాలతో యల్లమ్మ మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘బిందు’వే బంధువై..



రైతన్నలను బిందు సేద్యం బంధువులా ఆదుకుంటోంది. తక్కువ నీటితో ఎక్కువ భూమి సాగు చేసుకుంటూ అధిక దిగుబడులు సాధించుకునేందుకు వీలు కలుగుతోంది. జగనన్న ప్రభుత్వం కూడా బిందు సేద్యాన్ని(డ్రిప్ ఇరిగేషన్) ప్రోత్సహిస్తోంది. సబ్సిడీపై పరికరాలు అందిస్తూ అన్నదాతకు బాసటగా నిలుస్తోంది.

- రైతులను ఆదుకుంటున్న బిందు సేద్యం
- తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
- సబ్సిడీపై అన్నదాతకు ప్రభుత్వం డ్రిప్ సౌకర్యం



రైతులకు డ్రిప్ సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి(ఫైల్)



ఫిల్టర్‌ను చూపుతున్న రైతు నరసప్ప

డ్రిప్ పొందిన రైతుల వివరాలు

మండలం	రైతులు	హెక్టార్లు	సామగ్రి విలువ (రూ.కోట్లలో)	సబ్సిడీ (రూ.కోట్లలో)	రైతు చెల్లించిన నగదు
ఆదోని	193	160	2.13	1.84	రూ.42 లక్షలు
మంత్రాలయం	346	251.9	3.61	2.93	రూ .89 లక్షలు
కోసిగి	99	77.54	1.09	92లక్షలు	రూ.24 లక్షలు
పెద్దకడబూరు	384	2.68	3.81	3.18	రూ.85 లక్షలు
కౌతాళం	18	16.8	21.50 లక్షలు	17.54 లక్షలు	రూ.5.25 లక్షలు

మంత్రాలయంరూరల్: రైతు శ్రేయస్సే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో చర్యలు చేపట్టింది. రాయితీతో రైతులకు కూడా డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగానే ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో రైతులు సాగు చేసే వివిధ పంటలకు డ్రిప్ సౌకర్యం కల్పించడానికి ఏపీఎంఐపీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 5 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నారు. అలాగే 10 ఎకరాల వరకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సబ్సిడీ ఇలా..

5 ఎకరాల వరకు సబ్సిడీ గరిష్ఠంగా రూ.2.18 లక్షలు వస్తుంది. అలాగే 10 ఎకరాల వరకు కూడా సబ్సిడీ గరిష్ఠంగా రూ.2.18 లక్షలు అందుతుంది. 10 ఎకరాల కన్నా ఎక్కువగా ఉంటే సబ్సిడీ గరిష్ఠంగా రూ.4.18 లక్షలు లభిస్తుంది. 5 ఎకరాలకు 10 శాతం, 10 ఎకరాలకు 10 ఎకరాల వరకు ఉంటే 30 శాతం చొప్పున రైతులు తమ వాటాను డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంది.

తక్కువ నీటితో ఎక్కువ సాగు..

డ్రిప్ సౌకర్యం రైతులకు ఎంతో ఉపయోగకరం. నీటి సౌకర్యం తక్కువగా ఉన్నా రైతులకు డ్రిప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకుంటే తక్కువ నీటి సౌకర్యం ఉన్నా ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో రైతులు ఎక్కువగా మిరప, పత్తి పంటలను సాగు చేస్తుంటారు. ముఖ్యంగా డ్రిప్ సౌకర్యం పొందడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ స్థాయిలో రైతులు ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకుంటున్నారు. అన్ని రకాల పంటలను కాపాడుకోవడానికి డ్రిప్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఎమ్మెల్యే చొరవతోనే..



దరఖాస్తు చేసుకున్న సూగూరు గ్రామానికి చెందిన రైతులందరికీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చొరవతోనే డ్రిప్ సామగ్రి సబ్సిడీతో అందింది. డ్రిప్ ఏర్పాటు చేయడంతో పంటలకు నీరు అందించడం సులభతరమైంది. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వస్తుంది.

– రామకృష్ణ, రైతు, సూగూరు

శ్రమ తగ్గుతుంది



గతంలో సాగు చేసిన పంటలకు కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.దీనికి తోడు పైప్‌లైన్‌లో ఎక్కడైనా చెత్త పేరుకుంటే నీటి సప్లయ్ నిలిచిపోయేది. ఇప్పుడు అలా కాకుండా 3 ఫేస్ కరెంట్ రాగానే ఆటోమేటిక్ మోటార్ బోరు ఆన్ అవుతుంది.డ్రిప్స్‌కు మధ్యలో ఫిల్టర్‌లు ఏర్పాటు చేయడంతో మట్టి, చెత్త నిలిచి నీటిని మాత్రమే సరఫరా చేస్తుంది. దీంతో రైతులకు శ్రమ తగ్గింది.

– నరసప్ప, రైతు, సూగూరు

1,046 హెక్టార్లకు డ్రిప్ సౌకర్యం



ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాపు 1046 హెక్టార్లకు డ్రిప్ సౌకర్యం కల్పించడం జరిగింది. డ్రిప్ సౌకర్యం కోరకు దరఖాస్తు చేసుకు న్న ప్రతి ఒక్క రైతుకు డ్రిప్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆసక్తి కల్గిన రైతులు నేరుగా ఆర్బీకే ద్వారా దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది.

– ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ

న్యాయవాదులు విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: రెండు రోజులక్రితం ఢిల్లీలో జరిగిన న్యాయవాది వీరేంద్రనర్వాల్ హత్యను ఖండిస్తూ మంగళవారం ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ నాయకులు అనితబాయి, అంజినప్ప డిమాండ్ చేశారు. నిరసనల్లో సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆనంద్, సావిత్రి, భారతి, అర్చన, రవితేలచో, నెట్టేకంటయ్య, సునీతరెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సర్పంచ్ అయ్యమ్మ

కోసిగి: మేజర్ పంచాయతీ కోసిగి పరిధిలో చేపట్టే భవన నిర్మాణాలు, లేఅవుట్లకు పంచాయతీ అనుమతి తప్పనిసరిగా పొందాలని, ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కొందరు ఇష్టారాజ్యంగా పంచాయతీ అనుమతి లేకుండా భవనాలు నిర్మించడం, పంచాయతీ రోడ్లను ఆక్రమించుకోవడం జరుగుతోందన్నారు. లేఅవుట్లు వేసే ప్రతి ఒక్కరూ డాక్యుమెంట్స్ పంచాయతీ వారికి సమర్పించి అప్రూవల్ పొందాలన్నారు. నిబంధనల మేరకు రోడ్లు, పార్కింగ్, విద్యుత్, మౌలిక వసతులు కల్పించి తర్వాత లేఅవుట్లు వేసుకోవాలని సూచించారు.

రక్తహీనత లేకుండా చూడాలి



పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భవతులకు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ చెప్పారు. మంగళవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతిగా గుర్తించిన వెంటనే గర్భిణి వివరాలు నమోదు చేయాలన్నారు. వారికి ఎప్పుడెప్పుడు ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లీ బిడ్డ క్యాలెండర్ ద్వారా ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులను తేదీల వారీగా పర్యవేక్షించాలని సూచించారు. హైరిస్క్ కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత, ఎంపీహెచ్‌ఈవో రమణ, పీహెచ్‌ఎన్ వీరకుమారి, హెచ్‌ఎస్ సంపత్‌కుమార్, డీసీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

రాయలసీమ సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్, సుంకన్న మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాష్ట్ర రాజధాని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ ఎడారిగా మారుతుందని తెలిసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కురువ మద్దిలేటి, ఎర్రకోట మల్లప్ప, వెల్దుర్తి ఎల్లరాముడు, జయరాముడు, గణేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ లింక్ తప్పనిసరి

కౌతాళం: ఓటర్ కార్డుకు ఆధార్‌కార్డు లింక్ తప్పనిసరి అని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఓటర్లు తమ ఓటరు కార్డుకు ఆధార్‌లింక్‌తో అనుసంధానం చేసుకోవాలన్నారు. గతంలో ఓటర్లు ఆధార్‌తో అనుంధానం చేసుకున్నారన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే త్వరగా ఆధార్‌లింక్ చేసుకోవాలన్నారు. ఆధార్ అనుసంధానం లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలతో పాటు ఓటర్‌లిస్ట్‌లో పేర్లను తొలగించాల్సి వస్తుందన్నారు.

10లోపు పంటలు నమోదు చేసుకోండి

కౌతాళం: రబీ సీజన్‌లో సాగుచేసుకున్న పంటల వివరాలను ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈక్రాప్ బుకింగ్ కోసం మరోసారి గడువు పొడిగించిందన్నారు. బోర్లు, చెరువు, బావుల కింద సాగు చేసుకున్న పత్తి, వేరుశనగ, ఉల్లి తదితర పంటల వివరాలను వ్యవసాయ సిబ్బందికి అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు.

ముగిసిన సువార్త సభలు

ఆదోని అర్బన్: మూడు రోజులుగా పట్టణంలో సాగుతున్న తపస్సు కాల సువార్త మహాసభలు మంగళవారంతో ముగిశాయి. హైదరాబాద్ దైవవాక్కు సభ ప్రముఖ ప్రసంగీకులు, డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ అనిల్‌కుమార్, తుల్జామేరి రాజశ్రీ, ఆదోని కతోలిక మండిగిరి బాలయేసు, చర్చి విచారణ గురువు డీన్ రెవరెండ్ ఫాదర్ కోల విజయరాజులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. క్రీస్తు సందేశాలను పాటించాలన్నారు.

స్థలాల ఆక్రమణపై విచారణ

ఆలూరు రూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ గోదాము ఆవరణంలో స్థలాలు ఆక్రమించిన వారి వివరాలను మంగళవారం పోలీసులు సేకరించారు. జిల్లా మేనేజర్ రాజేష్ ఈ విషయమై సోమవారం ఆలూరు సీఐకు ఫిర్యాదు చేశారు. సొసైటీకి సంబంధించి మొత్తం 39 సెంట్ల స్థలం ఉందన్నారు. ఇందులో 6 సెంట్లు గోదాముకు లారీలు రావడానికి రస్తా కోసం వదిలారు. ఇటీవల కొంత మంది అక్రమంగా స్థలం ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై ఫిర్యాదు మేరకు సీఐ ఈశ్వరయ్య పోలీసు సిబ్బందిని పంపి స్థలాలు ఆక్రమించుకున్న వారి వివరాలను సేకరించారు. ఆక్రమణదారులను స్టేషన్‌కు పిలిపించి స్థలం ఖాళీ చేయాలని సూచించారు.

కోసిగి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిపై ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కోసిగి సచివాలయం–3 పరిధిలోని డాక్టర్ చిన్నలక్ష్మన్న హాస్పిటల్ వద్ద నుంచి పెద్ద మసీదు వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించిందన్నారు. ఆ నిధులతోనే పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వారే పార్టీకి రథసారథులు

వైఎస్సార్‌సీపీకి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే రథసారథులని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కందుకూరు, సాతనూరు, అగసనూరు, జంపాపురం, సజ్జలగుడ్డం, పెద్దభూంపల్లి గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల సచివాలయాల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ఘనంగా సుంకులమ్మ జాతర



క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచి బహుమతి అందుకుంటున్న సిద్ధినగట్టు ప్రేమ్ జట్టు

వెల్దుర్తి: సిద్ధినగట్టు గ్రామంలో సుంకులమ్మ తల్లి బోనాల పండుగ (జాతర) మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాత్కాలిక అంగళ్ల వద్ద కొనుగోళ్లు, పుట్టింటికి చేరుకున్న ఆడపడుచులతో గ్రామంలో కోలాహలం సంతరించుకుంది.

క్రికెట్ పోటీల విజేత సిద్ధినగట్టు ప్రేమ్ జట్టు

సుంకులమ్మ తల్లి జాతర పురస్కరించుకుని వారం క్రితం ప్రారంభించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. 40 జట్లు తలపడిన పోటీలలో ఫైనల్‌లో సిద్ధినగట్టు ప్రేమ్ జట్టు వెల్దుర్తి బాలుమహేశ్ జట్టును ఓడించి విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు రూ.20 వేలు, రన్నర్స్‌కు 15 వేలు, మూడవ స్థానంలో నిలిచిన సిద్ధినగట్టు జూనియర్స్ జట్టుకు రూ.10 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన సూదేపల్లె పవన్ జట్టుకు రూ.5 వేలు, ట్రోఫీలు, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్, మ్యాచ్ తదితర బహుమతులను నిర్వాహకులు అందించారు.

నేడు గిరకపందేలు

5వ తేదీ మండల స్థాయి ఒక బండి గిరక పందేలు నిర్వహించనున్నారు. విన్నర్‌కు రూ.10 వేలు, రన్నర్‌కు రూ.5 వేలు అందించనున్నారు. వివరాలకు 9640350047 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ సూచించారు. మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఎంపిక చేసిన 60 మంది రైతులకు ఈ నెల 6వ తేదీ వరకు పంటల సాగుపై శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం శిక్షణలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి, వేరుశనగ, వరి, అపరాలు, మిరప, ఉల్లి పంటల సాగులో మెలకువలు వివరించారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకొని భూసార పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేసుకుంటే మంచిదని తెలిపారు. బనవాసిలో మట్టి నుమునా, నీటి నమునా పరీక్షలు చేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కేవీకేలో సాగు చేస్తున్న పంటలు, షేడ్ నెట్‌లో పెంచుతున్న నారు మడులపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, లక్ష్మణ్, మౌనిక, నిరంజన్‌రెడ్డి, చందన, మహదేవయ్య, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుడి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్న చెంచయ్య (45) సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాదిన్నర క్రితం తల్లి లక్ష్మీదేవి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ కూడా భారమయ్యింది. ఈయనకు భార్య నాగమణితో పాటు నలుగురు సంతానం. ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించి కిందికి దించి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ ఏఎస్ఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ పేట శ్రీరామాలయం 98వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఏడు రోజులు ప్రతి రోజూ ఏకాంత సీతారాముల వారికి సుప్రభాత సేవ, పంచామృతము, దివ్యాలంకారాలతో పంచరాత్రాగమంతో హోమాలు, రోజుకొక వాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఉదయం పండిత శ్రీ విద్యానిధి ఆచార్యులచే మహాభారత తాత్పర్య నిర్ణయం, సాయంకాలం పండిత శ్రీ గోవర్ధనాచార్యులచే శ్రీమద్రామాయణ ప్రవచనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 9వ తేదీ కర్ణాటక ప్రముఖ కళాకారులచే భక్తి సంగీత విభావరి, 10వ తేదీ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, సాయంకాలం గడియారం ఆసుపత్రి దగ్గర గల నూతన స్వర్ణాలంకార రథంలో రథోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్విజ్‌లో కేఎంసీ విద్యార్థికి ప్రథమ బహుమతి

కర్నూలు(హాస్పిటల్):రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థి ప్రథమ బహుమతి సాధించాడు. వైజాగ్‌లోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఇటీవల నిర్వహించిన సీఎంఈ సందర్భంగా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రస్థాయిలో 18మెడికల్ కాలేజీల నుంచి వైద్య విద్యార్థులు పాల్గొని పోటీపడ్డారు. క్విజ్ పోటీ లో కర్నూలు మెడికల్‌కాలేజీ అనెస్థీషియా విభాగం ఫైనలియర్ విద్యార్థి డాక్టర్ మహమ్మద్ అబుజాహిద్ ప్రథమ బహుమతి సాధించాడు. మంగళవారం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ అభినందించారు.

ఉపకార వేతనం.. భవితకు సోపానం

- ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ఆదోని, పత్తికొండ డివిజన్లలో 150 మంది విద్యార్థుల ఎంపిక
- ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్
- సత్ఫలితాలనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు



ఆలూరు మోడల్ స్కూల్

ఆలూరు రూరల్: తల్లిదండ్రులు పడుతున్న శ్రమను వారు కళ్లారా చూశారు. తమ చదువు అమ్మానాన్నకు భారం కాకుడదని భావించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కష్టపడి చదివి నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ (ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్ షిప్ అర్హత పరీక్షలో సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఏటా జాతీయ స్థాయిలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తుంది. అందులో ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకారం వేతనం అందిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఆదోని, పత్తికొండ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులు అర్హత సాధించి ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను చేరువ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే నిరుపేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. డిజిటల్ విద్యను అందించేందుకు ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు అందించారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. దీంతో నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.